క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం రూరల్: జిల్లాలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5 వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.లక్ష్మణకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 24 లోపు ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా సమీప గురుకుల పాఠశాలలో గాని దరఖాస్తులు అందజేయాలన్నారు. ఐదో తరగతిలో చేరేవారికి ఏప్రిల్ 23న ఉదయం 10 గంటలకు, ఇంటర్‌లో చేరేవారికి మధ్యాహ్నం 2 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఉత్సాహంగా సిరిమానోత్సవం



వెలంపాలెం గోగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద సిరిమానోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన గోగులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సిరిమానోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

కాజులూరు: మండలంలోని పల్లిపాలెంకు చెందిన రాయుడు ఏడుకొండలు (50) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గొల్లపాలెం పోలీసులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఏడుకొండలు మద్యానికి బానిసై తరచూ మద్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడు. దీంతో ఇటీవల భార్య ఏడుకొండలుని వదలి వెళ్లిపోవటంతో మనస్థాపం చెంది సోమవారం పొలాల్లో గడ్డి చంపటానికి ఉపయోగించే మందును తాగేశాడు. అపస్మారక స్థితికి చేరుకోవటంతో కుటుంబ సభ్యులు గమనించి సమీపంలోని యానం ప్రభుత్వాసుపత్రికి చేర్పించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఏడుకొండలు మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసును ఏఎస్సై బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో జన్ ఔషధి దివస్



వెలంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో మంగళవారం జన్ ఔషధి దివస్ కార్యక్రమం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీపీ, సుగర్, ఇతర దీర్ఘ వ్యాధిగ్రస్తులను పరీక్షించి వారికి నెలకు సరిపోయే విధంగా మందులు అందజేశారు. అదే విధంగా అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆహార నియమాలు, యోగాలతో రోగాలను దూరంగా ఉంచవచ్చని సూచించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌ఓ వీరవేణి, పీహెచ్‌ఎస్ సుబ్బలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ గోవిందబాబు, సూపర్‌వైజర్లు గంగాధరరావు, వరలక్ష్మి, కమల్‌శేషు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దేవతామూర్తుల వాహనాల ఊరేగింపు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేవతామూర్తుల వాహనాల ఊరేగింపు నిర్వహించారు. స్వామి ఆలయం వద్ద నుంచి అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వీధులు మీదుగా గరుడ, అశ్వ, గజ, సర్ప తదితర అవతార మూర్తుల ప్రతిమలున్న వాహనాలు ఊరేగాయి. ఇరు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గాంబిక జాతర



విజయ దుర్గాంబిక గరగ ఊరేగింపు దృశ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరులోని విజయ దుర్గాంబిక అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద నుంచి గ్రామ వీధుల్లో జాతర సాగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సాగిన ఊరేగింపులో భక్తులు పాల్గొన్నారు. బుధవారం ఆలయం వద్ద తీర్థం, నైవేద్య సమర్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

అన్ని రంగాల్లో అగ్రగాములుగా

- రెండు నియోజకవర్గాల్లో విశేషంగా మహిళాశక్తి
- అన్ని రంగాల్లో సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న స్త్రీమూర్తులు
- సంక్షేమంతో సంతృప్తి
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



2022 మే 5న కరోనా వేళ భయం వీడి వ్యాక్సినేషన్ చేస్తున్న నర్సు (ఫైల్)



2022 జూన్ 6న అంగరలో దిశ యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా ఉద్యోగులు (ఫైల్)

కపిలేశ్వరపురం: 'ఆకాశంలో సగమున్నాం అన్నింటా మేముంటాం' అంటూ చైతన్య గీతికను గొంతెత్తి చాటిన రోజు నేటి మహిళా దినోత్సవం. సమాజాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, పరిపాలన విభాగాల్లో తనదైన శైలిలో రాణించిన ఆదర్శ మహిళా మణిపూస లెందరో నాడు ఆదర్శంగా నిలిచారు. అదే ఒరవడిలో అనేక రంగాల్లో నేటి మహిళలు తమ శక్తి యుక్తులను ప్రదర్శిస్తూ ప్రతిభా పాటవాలను చాటుతున్నారు. అమ్మ, అక్క, చెల్లి, భార్య బంధమేదైనా సమాజ ప్రగతికి రథ చక్రంగా నిలిచిన మహిళా ప్రాధాన్యతను మహిళా దినోత్సవం సందర్భంగా తెలుసుకుందాం...

రెండు నియోజకవర్గాల్లో శ్రామిక శక్తి ఇలా...

మండపేట పట్టణంలో 81, రూరల్ మండలంలో 106, కపిలేశ్వరపురంలో 76, రాయవరంలో 94 మంది మహిళా ఉద్యోగులున్నారు. మండపేట నియోజకవర్గంలో 242, రామచంద్రపురం నియోజకవర్గంలో 263 మొత్తం 505 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సుమారు 840 మంది అంగన్‌వాడీలు ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో కృషి చేస్తున్నారు.

9,992 శ్రమ శక్తి సంఘాల్లోని 49,963 మంది సభ్యులకు వందలాది మంది యానిమేటర్లు సేవలు అందిస్తున్నారు. సుమారు 300 ఇటుక బట్టీల్లో మూడు వేల మంది వలస కార్మికులుండగా వారిలో అధికులు మహిళలే. ఇంకా సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలుగా మహిళలు సమాజాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

మహిళా రాజకీయ ప్రాతినిధ్యమిలా...

మండపేట, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్లుగా మహిళలున్నారు. మండపేటలో 30కి 18 వార్డుల్లోనూ, రామచంద్రపురంలోని 28కి 18 వార్డుల్లో మహిళలు కౌన్సిలర్లు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఒక జెడ్పీటీసీ, ముగ్గురు ఎంపీపీ, 29 ఎంపీటీసీ, 37 మంది సర్పంచులుగా ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో ఇద్దరు జెడ్పీటీసీ, ఒకరు ఎంపీపీ, 31 మంది ఎంపీటీసీ, 23 మంది సర్పంచ్‌లుగా పాలనలో కీలకంగా ఉన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మహిళా భద్రత, మహిళా సంక్షేమాలకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. దిశ యాప్ రూపకల్పనతో క్షేత్ర స్థాయిలో నేరాలు అదుపులోకి వచ్చాయి. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా మండపేట నియోజకవర్గంలోని 73 లేఅవుట్లలో 8,854 ప్లాట్లను, రామచంద్రపురం నియోజకవర్గంలోని 128 లే అవుట్లలో 8,453 ప్లాట్లకు గానూ 8,291 ఇళ్లను నిర్మించి మహిళలను హక్కుదారులను చేస్తోంది. అలాగే నేతన్న నేస్తం, వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ వడ్డీ రాయితీ పథకాల ద్వారా మహిళాభ్యుదయానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా మహిళా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది.

నాన్న ఆశయం తీర్చానన్న సంతృప్తి మిగిలింది



అమ్మ శ్యామల, నాన్న సత్యనారాయణలది సాధారణ కుటుంబం. వారికి ముగ్గురూ ఆడపిల్లలమే సంతానం. మగపిల్లాడు లేడంటూ ఇరుగుపొరుగు వారు అనే మాటలు ఆనోటా ఈనోటా విని అమ్మనాన్న బాధపడేవారు. నాన్న సాంకేతిక రంగంలో ఉద్యోగం చేస్తూ ముగ్గురినీ చదివించారు. ముగ్గురూ ఐక్యంగా ఉంటూ వృద్ధిలోకి రావడమే నాకు ఆనందం అనేవారు. అందుకు చదువే ఆధారం అనేవారు. ముగ్గురిలో ఒక్కరైనా డాక్టర్ కావాలని ఆయన ఆశయం. దానిని నేను మనసులో పెట్టుకుని కష్టపడి బీడీఎస్ చదువుకున్నాను. డెంటిస్టుగా నేను, లెక్చరర్లుగా అక్కలిద్దరూ అనుకున్న స్థాయికి చేరుకున్నాను. ముగ్గురు ఆడపిల్లలతో భలే నెట్టుకొచ్చారంటూ అమ్మ, నాన్నలను ప్రశంసించినపుడల్లా మాకు ఆనందం కలుగుతుంది.

– డాక్టర్ అదపా మహీజ, సుందరపల్లి, కె.గంగవరం మండలం

మహిళల ప్రాధాన్యం పెరిగింది



రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో గ్రామ వార్డు సభ్యుడి స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలోని అనేక విభాగాల్లో మహిళలు ప్రజాప్రతినిధులయ్యారు. గత ప్రభుత్వాలు మాటలకే పరిమితం అయ్యేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేసి చూపించారు. మాలాంటి వారెందరో ప్రజాప్రతినిధులుగా సేవలందించగలుగుతున్నాం.

–కుడుపూడి భవాని, జెడ్పీటీసీ సభ్యురాలు, మండపేట మండలం

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

రామచంద్రపురం: మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని వాటిని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె మాధవీదేవి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ, ఏజేఎఫ్‌సీఎం ఆర్.ఆశీర్వాదం పాల్‌లు మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిడి హరినాథ్‌రెడ్డి, ప్యానల్ అడ్వకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ, మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక అసమానతలపై మహిళలు పోరాడాలి



మహిళా దినోత్సవం సందర్భంగా ప్రసాద్ గీసిన చిత్రం



రాయుడు త్రినాథప్రసాద్

రామచంద్రపురం రూరల్: సాంఘిక అసమానతలపై మహిళలు పోరాడి విజయం సాధించాలన్న ఆకాంక్షను చిత్రరూపంలో వెలిబుచ్చారు రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్. ఆర్థిక స్వాతంత్ర్యం, బలహీనురాలిననే భావం, కట్టుబాట్లు, లింగ భేదాలను స్వేచ్ఛగా ఉండాలనే ఆకాంక్షతో, చదువు అనే ఆయుధంతో ఎదుర్కోవాలనే అర్థం వచ్చేలా మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆయన గీసిన చిత్రం పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, ఉపాధ్యాయుడు రాయుడు ప్రసాద్‌ని అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న మండల సమాఖ్య అధ్యక్షురాలు

కె.గంగవరం: మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలం కేంద్రం కె.గంగవరంలో మంగళవారం మహిళా సమాఖ్య కేంద్రం వద్ద మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మహిళలు అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం వీఓఏలు, సీఆర్‌పీలు, మహిళా ప్రజాప్రతినిధులు ఆటపోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కుడుపూడి మంగాదేవి ఆధ్వర్యంలో ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ తదితరులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

రామచంద్రపురం: పట్టణంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి శ్రీపుష్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ అంగర సింగరాచార్యులు, ఆలయ అర్చకులు అంగర రాంబాబు, అంగర రమణబాబు, పండితులు అంగర వేణుగోపాలాచార్యులు, అంగర కృష్ణమాచార్యులు, వేదాంతం నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. దంపతులకు దంపతి తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గృహ సారథులే పార్టీ విజయ సారథులు

- ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించండి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు దిశా నిర్దేశం



మండపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: గృహ సారథులే రథ సారథులుగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయంలో కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక విజయ ఫంక్షన్ హాల్లో మంగళవారం పట్టణ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన ×మా నమ్మకం నువ్వే జగన్ ၊ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ లబ్ధి చేకూర్చే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ సాగిస్తున్న పాలనను ప్రతీ గడపకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందన్నారు.

ప్రభుత్వంపై బురద చల్లడమే ఎమ్మెల్యే వేగుళ్ల పని

అసత్య ప్రచారంతో ప్రభుత్వంపై బురద జల్లడమే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ తోట విమర్శించారు. తాపేశ్వరం రోడ్డు అభివృద్ధిలో భాగంగా చెట్లు తొలగించే పనిలో అధికారులు నిమగ్నమై ఉంటే పనుల్లో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల చేస్తున్న ఆరోపణలపై ఆయన మండి పడ్డారు. మాట్లాడే మాటల్లో అర్థం ఉండాలని, ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు విశ్వసించరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే వేగుళ్లకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు.

రాయవరం గృహ సారథులకు శిక్షణ

రాయవరం: ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింతగా వివరించి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి గృహ సారథులు కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మండలంలోని వి.సావరం, వెదురుపాక, నదురుబాద, రాయవరం, లొల్ల, సోమేశ్వరం గ్రామాల సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో మంగళవారం రాయవరంలో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు, ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. గృహ సారథులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతలి సుబ్బరామారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు చిన్నం అపర్ణ తదితరులు కూడా ప్రసంగించారు. వెదురుపాక, వి.సావరం, మాచవరం, రాయవరం సర్పంచులు మల్లిడి పెద్దబ్బాయి, కాకి కృష్ణవేణి కోటేశ్వరరావు, కత్తుల సీతామహాలక్ష్మి అప్పారావు, చంద్రమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు



గొల్లపాలెంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిపై నాకాబందీ నిర్వహిస్తున్న స్టేషన్ సిబ్బంది

కాజులూరు: మానవ తప్పిదాల వలనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం పోలీస్టేషన్ ఎస్సై ఎం.తులసీరామ్ న్నారు. మంగళవారం గ్రామంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిపై ఎస్సై ఎం.తులసీరామ్, స్టేషన్ సిబ్బంది నాకాబందీ నిర్వహించి రికార్డులు సక్రమంగా లేని పలు లారీలు, ట్యాక్సీలు, కార్లు, మోటారుసైకిళ్లు తదితర వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులతో మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపటం వల్లే ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయన్నారు. ప్రయాణికులు రోడ్డుపై వెళ్లే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏఎస్సై డేవిడ్, పోలిస్‌స్టేషన్ సిబ్బంది కుమార్, సత్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ వేడుకల్లో విజయకేతనం చూపిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, క్లబ్ సభ్యులు

మండపేట: ఒకప్పుడు వంటింటికి మాత్రమే పరిమితం అనే భావన నుంచి మహిళలు ఇప్పుడు పరిమితులు లేకుండా అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మండపేటకు చెందిన వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేపీ రోడ్డులోని చైర్‌పర్సన్ కార్యాలయంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మిర్తిపాటి మహాలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చైర్‌పర్సన్‌ని సత్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు సాధిస్తు న్న విజయాలు మహిళల గొప్పతనాన్ని చాటుతున్నాయన్నారు. గృహిణి నుంచి అంతరిక్షం వరకూ మహిళలు పోషిస్తున్న పాత్ర గణనీయమైనదని కొనియాడా రు. అనంతరం మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించిన మహిళలకు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు మండవల్లి దేవి, అద్దేపల్లి మమత, సంకా సీత, కాశి అన్నపూర్ణ, చైర్మన్ బోడా వీర్రాజు, పసుమర్తి సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష



సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న గృహసారథుల కమిటీ పరిశీలకులు పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావు తదితరులు

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ఉపయోగించుకోవటంలో ప్రజలలో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకురాగలమని డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, గృహసారథుల కమిటీ పరిశీలకుడు పంపన సుబ్బారావు అన్నారు. మంగళవారం మండల గ్రామాల్లో పరిశీలకులు పర్యటించి పార్టీలో కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. గొల్లపాలెం గ్రామ సచివాలయం–2లో పెట్టా శ్రీనివాస్, పంపన సుబ్బారావులు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కావటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి వెంకటేశ్వర్రావు, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, సచివాలయ కన్వీనర్లు మాత బోస్, చంద్రబాబు, వడ్డి శ్రీను, తోట కృష్ణ, కాకతీయ రాజు తదితరులు పాల్గొన్నారు.

చీకటి ఒప్పందాలు బయట పెట్టాలి



ఎస్‌బీఐ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కామన తదితరులు

మండపేట: ప్రధాని నరేంద్రమోదీ, అదానీల చీకటి ఒప్పందాలను కేంద్రం బయట పెట్టాలని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని మెయిన్ రోడ్డు, ఏడిద రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచీల వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి కామన నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ, ఇతర జాతీయ బ్యాంకుల్లోని పేదల డిపాజిట్లను అదానీ గ్రూపులకు మళ్లించడాన్ని నిరసిస్తూ ఈ ధర్నాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, పర్వతిన వీరవెంకట సత్యనారాయణ, అలమండ సూరిబాబు, పిల్లి అప్పన్న, మగ్గం జాకబ్ రాజు, గండ్రోతుల రామచంద్రరావు, వాసిరెడ్డి బాబూరావు, జువ్వల ఆదినారాయణ, వేమగిరి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలతో పని చేయిస్తే చర్యలు

రాయవరం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, వారిని పనిలో చేర్చుకుంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆల్టర్‌నేటివ్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ దొండపాటి రమేష్‌బాబు హెచ్చరించారు. ఎంఈఓ వై.సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆయన మండలంలోని మాచవరం, సోమేశ్వరం, రాయవరం గ్రామాల్లో బడి బయట పిల్లలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష తరఫున ఈ డ్రైవ్ చేపట్టామన్నారు. బడి ఈడు పిల్లలను వ్యాపార సంస్థల్లో, ఇటుక బట్టీల్లో, ఇళ్ల వద్ద, వ్యవసాయ సంబంధిత, భవన నిర్మాణ పనుల్లో పెట్టుకున్నట్లు తెలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పలు ఇటుక బట్టీల యజమానులను కలసి దీనిపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు కిలపర్తి కోసురాములు, వైఎల్ వీర్రాజు, వాసంశెట్టి సీతాధనలక్ష్మి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ సొసైటీలుగా అభివృద్ధి చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ ఓఎస్‌డీ రాజీవ్‌బాబు

రామచంద్రపురం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మోడల్ సొసైటీలుగా తీర్చిదిద్దడానికి సహకార సంఘాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఆప్కాబ్ ఓఎస్‌డీ రాజీవ్‌బాబు అన్నారు. ద్రాక్షారామ సొసైటీలో మంగళవారం రాష్ట్ర సహకార ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమానికి రాజీవ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆప్కాబ్ ద్వారా సొసైటీలకు వచ్చే స్కీముల గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాబోయే కాలంలో అన్ని సొసైటీలను మోడల్ సొసైటీలుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయన్నారు. దీనికి సహకార సంఘాల ఉద్యోగులు సహకరించాలని కోరారు. రామదాసు సహకార శిక్షణా సంస్థ అధ్యాపకుడు, ట్రైనింగ్ ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు సహకార చట్టంలోని ముఖ్యాంశాలు, సొసైటీల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యాపార ప్రణాళికలు, సొసైటీల అభివృద్ధికి సంఘ సీఈఓల పాత్ర తదితర అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో సొసైటీ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ పెంకే సత్యనారాయణ, రాష్ట్ర యూనియన్ కోశాధికారి తోట వెంకటరామయ్య, ద్రాక్షారామ సొసైటీ చైర్మన్ దామిశెట్టి వీవీ చంద్రశేఖర్, సీఈఓలు పాల్గొన్నారు.